క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కర్లపాలెం: కర్లపాలెం సెంటర్‌లోని ఓ షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం సెంటర్‌లోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీనివాస కూల్‌డ్రింక్ షాపులో గత నెల 30వ తేదీన ఓ యువకుడు గల్లాపెట్టెలో ఉన్న నగదు చోరీ చేసి పారిపోయాడని షాపు ఓనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అన్నారు. చుండూరు మండలం మోదుకూరుకు చెందిన కుంభా వెంకటేష్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి శుక్రవారం ఉదయం కర్లపాలెం సెంటర్‌లో అతనిని అరెస్ట్ చేసి రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించారని ఎస్ఐ రవీంద్ర వివరించారు.

మాదకద్రవ్యాలపై అవగాహన



అమృతలూరు(వేమూరు): మాదకద్రవ్యాలను ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ రవితేజ అన్నారు. అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాపట్ల జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వల్ల ప్రాణానికి హాని జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక లీగల్ సెల్ పని చేస్తుందని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు మీ దృష్టికి వస్తే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపాలి



కర్లపాలెం: బడి ఈడు వయస్సు పిల్లలందరినీ బడికి పంపించాలని కర్లపాలెం ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు శుక్రవారం కర్లపాలెం మండల పరిధిలోని పలు గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. అనంతరం దుండివారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని అక్కిరాజుదిబ్బ కాలనీని సందర్శించి అక్కడి పిల్లలు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా బడికి పంపించాలని తల్లిదండ్రులకు చెప్పారు. చదువుకోవటం వలన జీవితాలు మెరుగుపడతాయని తలిదండ్రులకు సూచించారు. కార్యక్రమాలలో ఎంఈవో విజయశ్రీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చెత్త సేకరణపై సీఆర్పీలకు శిక్షణ



చేబ్రోలు: గ్రామీణ ప్రాంతాలలో శాస్త్రీయ, సుస్థిరమైన, వికేంద్రీకృత పద్ధతిలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను, బలోపేతం చేసే లక్ష్యంతో సీఆర్పీల ఎంపిక జరిగిందని జిల్లా పంచాయతీ వనరుల కో ఆర్డినేటర్ అనూరాధ అన్నారు. చేబ్రోలులోని చెత్త సంపద కేంద్రంలో శుక్రవారం కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు మండలాలకు చెందిన సీఆర్పీలకు ఎస్‌డబ్ల్యూసీ షెడ్ల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. క్రియాశీల మహిళలను సీఆర్పీలుగా ఎంపిక చేశామని, గృహ స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.ఉషారాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాపట్లటౌన్: కళాశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన హైకోర్టు అడ్వకేట్ జనార్ధన్‌రావు శుక్రవారం బాపట్ల రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా అటువైపుగా వచ్చిన బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్ ఇలా.. ప్రయాణం ఎలా..!?



దెబ్బతిన్న ఫుట్‌పాత్



ఫ్లైఓవర్‌పై గుంతలు



దెబ్బతిన బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన రబ్బర్లు

- బాపట్లలోని గుంటూరు ఫ్లైఓవర్‌పై గుంతలు, ఊడిపోయిన రబ్బర్లతో ఇబ్బందులు
- వాహనాలు దెబ్బతింటున్నాయంటున్న స్థానికులు
- ఒక వైపు వాహనాలు, మరోవైపు ఒళ్లు గుల్ల
- ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనం

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో కొత్త బస్టాండ్ వద్ద ఉన్న గుంటూరు ఫ్లైఓవర్ పై వాహనాలు ఎక్కితే అంతే సంగతి. అక్కడక్కడ ఫ్లైఓవర్ దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లై ఓవర్, బ్రిడ్జి నిర్మాణంలో (గడ్డర్ల వద్ద) ఏర్పాటు చేసిన బ్లాక్ రబ్బర్లు (బ్రిడ్జ్ బేరింగ్స్) దెబ్బతిన్నాయి. బాపట్ల పట్టణం నుంచి గుంటూరు వెళ్లడానికి ప్రధానమైన ఫ్లైఓవర్ ఇది. ఈ ఫ్లైఓవర్‌పై గుంటూరు నుంచి చీరాల మీదగా, చీరాల నుంచి గుంటూరు మీదగా వచ్చే బస్సులు, మోటార్ బైకులు, కార్లు, ఆటోలు ఎక్కువగా ప్రయాణిస్తుంటాయి. అలాగే బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం, కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఫ్లైఓవర్ దగ్గర ఉన్న వ్యవసాయ కళాక్షేత్రంలో ఉండటం విశేషం. అయితే గుంతల వల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. బ్లాక్ రబ్బర్లు కొన్నిచోట్ల ఊడిపోయి.. మరికొన్ని చోట్ల పెచ్చులు లేచిపోయి స్లాబ్ కమ్మలు దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఫ్లై ఓవర్‌పై గుంతల్ని తప్పించబోయి కొందరు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి.

ఫుట్‌పాత్‌లపై రాళ్లు ఊడిపోవటంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టైల్స్ మొత్తం ఊడిపోయినప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. వెంటనే ఫుట్‌పాత్‌ను కూడా మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



నేనురోజు కొత్త బస్టాండ్ వద్ద ఉన్న గుంటూరు ఫ్లైఓవర్‌పై రాకపోకలు సాగిస్తుంటాను. అయితే బ్లాక్ రబ్బర్లు కొన్ని చోట్ల ఊడిపోవడంతో వాహనాలు గుంతులో పడినట్లుగా ఉంటుంది. బళ్లు తరచూ రిపేర్లకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలి.

– డాక్టర్ పి.సి.సాయిబాబు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి

ప్రమాదాలకు అవకాశం



ట్రాఫిక్ సమస్య లేకుండా వాహన రాకపోకల కోసం ఫ్లైఓవర్‌ను నిర్మించారు. బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– కొమ్ము దుర్గ, బాపట్ల

అక్రమ ఇసుక ట్రాక్టర్‌ల కేసులో పోలీసుల పక్షపాతం

- కేసు లేకుండానే అక్రమ ఇసుక ట్రాక్టర్ విడుదల
- రాజకీయ నాయకుల ఒత్తిళ్లే ప్రధాన కారణమన్న ఆరోపణలు



పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టిన ఇసుక ట్రాక్టర్

కొల్లూరు: అక్రమ ఇసుక వాహనాలపై కేసుల నమోదులో పోలీసుల ఆశ్రిత పక్షపాతం విమర్శలకు దారితీసింది. గురువారం కృష్ణా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను కొల్లూరు పోలీసులు నిలువరించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం మరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా వాహనాలపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం చెల్లించడంలో భాగంగా కొల్లూరు తహసీల్దార్‌కు పోలీసులు కేసు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం పోలీసులు సీజ్ చేసిన 6 వాహనాలలో ఐదు ట్రాక్టర్లు, శుక్రవారం స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి, ఒక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం స్వాధీనం చేసుకున్న వాహనాలలో చుండూరు మండలం ఆలపాడుకు చెందిన ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌పై ఎటువంటి కేసు నమోదు చేయకుండా పోలీసులు ఉదాసీన వైఖరి కనబర్చడం వెనుక అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులు ఒత్తిడే ప్రధాన కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తహసీల్దార్‌కు బదిలీ చేశాం

ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్న అన్ని ట్రాక్టర్లపై కేసు నమోదు చేయడం జరిగింది. కేసును తహసీల్దార్‌కు బదిలీ చేసిన అనంతరం ఆయన అపరాధ రుసుం విధించడంతో పాటు ఆయన ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా ట్రాక్టర్లను విడుదల చేయడం జరిగింది.

– జానకి అమరవర్ధన్, ఎస్ఐ, కొల్లూరు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చుండూరు మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో, యడ్లపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

అమృతలూరు(వేమూరు): అమృతలూరు మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ఇంటూరు ఫీడర్, మూల్పూరు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నగరం: మండలంలోని ఉల్లిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని మంత్రిపాలెం పరిసర గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ నాగులమీరా శుక్రవారం తెలిపారు. మంత్రిపాలెం 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కొల్లూరు : విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతులలో భాగంగా శనివారం రెండు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లనున్నట్లు కొల్లూరు విద్యుత్ ఏఈ కె.సుధాకర్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిలుమూరు సబ్‌స్టేషన్ పరిధిలో చిలుమరు, కొత్త చిలుమూరు, ఈపూరు, అనంతవరం, కొల్లూరు కొంత పరిధిలోని పంట పొలాల్లో విద్యుత్ మోటార్లకు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. అదే విధంగా జువ్వలపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని కిష్కిందపాలెం, జువ్వలపాలెం, పోతార్లంక, తడికలపూడి, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, తురకపాలెం, గుంటూరుగూడెం, భట్టిప్రోలు మండలం చింతమోటులోని కొంత భాగం, కృష్ణా జిల్లా ఆముదార్లంక గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎక్సైజ్ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ



నగరంలో మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

నగరం: ఎక్సైజ్ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ చెప్పారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ నాటుసారా నిర్మూలన దిశగా చర్యలు చేపట్టాలని, సారా రహిత గ్రామాలుగా తీర్చేదిద్దే విధంగా కృషి చేయాలని కోరారు. ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులను నడపాలన్నారు. నౌకర్‌నామాలు ఎటువంటి తప్పిదాలు చెయ్యకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత లైసెన్స్‌దారులదేనన్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 58 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి 515 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆరు నాటుసారా కేసులను నమోదు చేసి 36.5 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి ఆరుగురిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. అనంతరం నగరంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. సీఐ మారుతి శ్రీరామ్‌ప్రసాద్, ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సముచిత గౌరవం

ఎంఈవో పులి లాజర్



అక్రమ్ ఘోరి దంపతులను సత్కరించిన ఉర్దూ ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: వృత్తిలో అంకితభావంతో పనిచేసిన ప్రతి వ్యక్తికి సమాజంలో సముచిత గౌరవం దక్కుతుందని ఎంఈవో పులి లాజర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గూడవల్లి మండల పరిషత్ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎండీ అక్రమ్ ఘోరి సెప్టెంబర్ 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా కలెక్టర్ చేతులమీదగా తీసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులు గూడవల్లి ఉర్దూ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుడు అక్రమ్ ఘోరి, పర్వీన్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో లాజర్ మాట్లాడుతూ అక్రమ్ ఘోరి విద్యార్థులకు చక్కగా విద్యాబోధన చేయటమే కాకుండా వివిధ శిక్షణ కార్యక్రమాలకు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించేవాడని అన్నారు. అక్రమ్ ఘోరి భవిష్యత్‌లో మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు ఘోరి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఘోరి దంపతులను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రహమతున్నీసా, ఆసియా బేగం, రజియా, బస్రి, ఆరీఫా, షమయతున్నీసా, మహ్మద్ నజీర్ అహ్మద్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ షేక్ షబీన, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి



కొల్లూరు : ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్న ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని విమర్శించారు. శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో భాగంగా కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బకాయి ఉన్న 4 డీఏలను తక్షణం విడుదల చేయడంతోపాటు, ఉద్యోగుల ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు ఎం.సత్యనారాయణ, రెడ్డి పద్మజ, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాల వెంబడి మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ దక్షిణ క్యాబిన్ వద్ద పట్టాల వెంబడి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని రైల్వే సిబ్బంది శుక్రవారం గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, పట్టాలు దాటే సమయంలో గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు చెప్పారు.

వేమూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



వేమూరు: పోలీసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో రికార్డులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రికార్డులు తనిఖీ చేయడం జరుగుతుందని, రికార్డులు సక్రమంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పట్ల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వేమూరు సీఐ కూడా శాంతి భద్రతల పట్ల నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీసులు ప్రతి గ్రామంలో నిఘాలు ఏర్పాటు చేయాలన్నారు. మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు గ్రామాల ప్రజలతో సమావేశం

వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ



లంకెవానిదిబ్బ, ఈలచెట్లదిబ్బ వాసులతో చర్చిస్తున్న ఆర్డీవోలు, అధికారులు

నాగాయలంక: మండలం శివారులో సముద్ర తీరాన ఉన్న ఈలచెట్లదిబ్బ వాసుల తాగు, సాగు నీటి సమస్యలకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపనున్నట్లు కృష్ణా, బాపట్ల జిల్లాల ఉన్నతాధికారులు ప్రకటించారు. కొద్దికాలంగా ఈలచెట్లదిబ్బ(నాగాయలంక మండలం), లంకెవానిదిబ్బ(బాపట్ల జిల్లా రేపల్లె మండలం) గ్రామాల నడుమ నీటి వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో రెండు జిల్లాల అధికారులు ఆయా గ్రామాల పెద్దలు, ప్రతినిధులతో శుక్రవారం లంకెవానిదిబ్బలో సమావేశమయ్యారు. లంకెవానిదిబ్బ వాసులను ఈలచెట్లదిబ్బ వాసులు తమవైపు నదిలోకి చేపల వేటకు రానీయకుండా అడ్డుకోవడంతోనే వారి గ్రామంలోని లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి దిబ్బకు వచ్చే సాగు, తాగు నీటి పైపులైన్లను అడ్డుకోవడంతో ఇరు జిల్లాల గ్రామాల నడుమ వివాదానికి దారితీసింది. కాగా అధికారులు ప్రధానంగా నీటి సమస్యపైనే దృష్టి కేంద్రీకరించిన నేపథ్యంలో నీటి సమస్య పరిష్కారంపై బందరు ఇన్‌చార్జి ఆర్డీవో బి.శ్రీదేవి, బాపట్ల ఆర్డీవో రామలక్ష్మి నేతృత్వంలో లంకెవానిదిబ్బ లిఫ్ట్ ఇరిగేషన్ పరిశీలించి అక్కడే ఇరుగ్రామాల వారితో సమావేశమై చర్చించారు. వారం రోజుల్లో తాత్కాలిక పైపులు ఏర్పాటు చేసి ఈలచెట్లదిబ్బ వాసులకు తాగు, సాగునీరు అందించేందుకు లంకెవానిదిబ్బ వాసులను అధికారులు ఒప్పించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్‌కు లెవల్ మెయింటెన్ చేసి లాకులు ఏర్పాటు చేస్తామని అధికార యంత్రాంగం వివరించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, తహసీల్దార్లు సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్, టి.శ్రీనివాస్ కృష్ణా ఇరిగేషన్ అధికారులు మోహన్‌రావు(ఎస్ఈ), రవికిరణ్(ఈఈ), లిఫ్ట్ ఇరిగేషన్ ఈఈ చెన్నారెడ్డి, డీఈఈ గణపతి, అవనిగడ్డ సీఐ యువకుమార్, నాగాయలంక ఎస్ఐ కె.రాజేష్, బాపట్ల జిల్లా ఇరిగేషన్ అధికారులు, రెండు గ్రామాల పెద్దలు, నీటి సంఘాల అధ్యక్షులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాంకు ఘన నివాళి



కూచిపూడిలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమృతలూరు(వేమూరు): కామ్రేడ్ సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో అలుపెరగని పోరాట యోధుడని సీపీఎం వేమూరు కార్యదర్శి బి.అగస్టీన్ తెలిపారు. మండలంలోని కూచిపూడి గ్రామంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేశారని ఆదర్శ కమ్యూనిస్టుగా జీవితాన్ని గడిపారన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. దేశంలో ఎక్కడ హింస జరిగినా గళం విప్పేవారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని అనేకసార్లు రాజ్యసభలో మాట్లాడారన్నారు. ఏచూరి మరణం పీడిత ప్రజలు, వర్గ పోరాటాలకు తీవ్రమైన లోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం, కార్యదర్శి పి.రాజు, కె.శ్యాంసన్, గాజులవర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

చెరుకుపల్లి: అట్టడుగు పేద ప్రజల కోసం సీతారాం ఏచూరి చేసిన సేవలు మరువలేనివని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని రేపల్లె సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రజా క్షేత్రంలో కమ్యూనిస్టు ఉద్యమంలో ఆదర్శ కమ్యూనిస్టుగా జీవితాన్ని గడిపారన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయి నాయకుడిగా, రాజ్యసభ ఎంపీగా పని చేశారన్నారు. ఆయన మరణం దేశంలో పీడిత ప్రజలు వర్గ పోరాటాలకు తీవ్రమైన లోటని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.కిషోర్, కె.రమేష్, డి.అగస్టిన్, జి.దానియేలు, వై.నవీన్, కె.గోపి తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో కేబుల్ వార్

- యాక్ట్ (ఏసీటీ) కేబుల్ వైర్లను తెంచిన బీసీటీ
- గుడిపూడిలో వైర్లు తొలగిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీటీ సిబ్బంది



రూరల్ పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న యాక్ట్(ఏసీటీ) సిబ్బంది

బాపట్లటౌన్: బాపట్లలో కేబుల్‌వార్ భగ్గుమంది... బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు సమీప బంధువైన జానకీ రామరాజుకు చెందిన బీసీటీ కేబుల్ సిబ్బంది శుక్రవారం రాత్రి మండలంలోని గుడిపూడి సమీపంలో యాక్ట్ (ఏసీటీ) కేబుల్ వైర్లను తొలగించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న యాక్ట్ సిబ్బంది తమ వైర్లను తొలగిస్తున్న బీసీటీ సిబ్బందిని పోలీసుల సమక్షంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని వారిని బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. యాక్ట్ కేబుల్స్‌ను తొలగిస్తుంటే స్వయంగా వెళ్లి పట్టుకున్నామని, తొలగించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ యాక్ట్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగని యాక్ట్ సిబ్బంది తక్షణమే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న యాక్ట్ సిబ్బంది నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. కాగా రాత్రి 11 గంటల వరకు ఆందోళన కొనసాగింది.

సంచారజాతులకు ఆధార్‌కార్డులు ఇప్పించటం అభినందనీయం

ఎంఈవో నవీన్‌కుమార్



ఆధార్ కార్డు పొందిన చిన్నారులను పాఠశాలలో చేర్పించిన దృశ్యం

చెరుకుపల్లి: రోడ్ల వెంట జీవిస్తున్న సంచార జాతుల వారికి ఇప్పటివరకు ఆధార్ కార్డులు లేక వారి పిల్లలను బడికి పంపకపోవటం దురదృష్టకరమని ఎంఈవో టి.నవీన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆరుంబాక రోడ్డు పక్కన జీవనం సాగిస్తున్న కొమరగిరి సుబ్బారావు కుటుంబానికి ఇప్పటి వరకు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందలేదని, ముఖ్యంగా వారి పిల్లలను పాఠశాలలో చేర్చలేదని అన్నారు. ఇది గమనించిన యానాదుల (గిరిజన) యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చౌటారి రమేష్ బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి సహకారంతో కొమరగిరి సుబ్బారావు కుటుంబ సభ్యులకు ఆధార్ కార్డులు మంజూరు చేయించారని తెలిపారు. దీంతో సుబ్బారావు పిల్లలను ఆరుంబాక మండల పరిషత్ పాఠశాలలో ఎంఈవో సమక్షంలో చేర్పించారు. ఈ సందర్భంగా సంచారజాతులు, రోడ్ల వెంట జీవించేవారిని గుర్తించి ఉన్నతాధికారుల ద్వారా ఆధార్ కార్డులు మంజూరు చేయించిన యానాదుల (గిరిజన) యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చౌటారి రమేష్‌ను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో యానాదుల (గిరిజన) యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యందేటి వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు బాపూజీ, నాగపుష్పజా, రాసంశెట్టి నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.